సాక్షి చిత్తూరు

మంగళవారం। 15। ఏప్రిల్। 2025



అంబేడ్కరంటే చిన్నచూపెందుకు?
అంబేడ్కర్ జయంతి వేడుకలకు కూటమి నేత లు గైర్హాజరుకావడంతో ఆయనంటే చిన్నచూపెందుకన్న విమర్శలొచ్చాయి. - 8లో



ఘనంగా తమిళ ఉగాది
రాష్ట్ర సరిహద్దులోని నగరిలో తమిళ సం వత్సరాది ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. - 8లో



వరసిద్ధుడి సేవలో సినీ రచయిత
కాణిపాకం వినాయకస్వామివారిని సినీ రచయిత విజయేంద్రప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

సెలవుపై డీఎఫ్‌ఓ

చిత్తూరు కార్పొరేషన్: డీఎఫ్‌ఓ భరణి వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆమె ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సెలవు పెట్టారు. అంత వరకు ఇన్‌చార్జిగా తిరుపతి డీఎఫ్‌ఓ వివేక్‌కు బాధ్యతలు అప్పగిస్తూ సీసీఎఫ్ యశోదబాయి ఆదేశాలు జారీ చేశారు.

ఏపీ జీఈఏ ఐక్యవేదిక కోచైర్మన్‌గా బాలాజీ



చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక (ఏపీ జీఈఏ ఐక్యవేదిక) కోచైర్మన్‌గా శవన్న గారి బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 13 న విజయవాడలోని విద్యాధరపురంలో ఏపీ జీఈఏ చైర్మన్ సూర్యనారాయణ అధ్యక్షన ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘంలో మండల స్థాయి నుంచి ఎదిగి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుతం బాలజీ సేవలందిస్తున్నారు. టీచర్ల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఆయనకు ఏపీ జీఈఏ కోచైర్మన్‌గా అదనపు బాధ్యతలను అప్ప జెప్పారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కల్పించిన నూతన బాధ్యతలను కర్తవ్యంతో నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని తెలిపారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



అంబేడ్కర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని నగరంలోని జిల్లా ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే తీవ్ర సామాజిక వివక్షను ఎదుర్కొన్న అంబేడ్కర్, రాజ్యాంగ నిర్మాతగా మారినతీరు నేటి యువతరానికి ఆదర్శమన్నారు. ఆయన సూక్తులు ప్రజల్ని ధర్మం, న్యాయం వైపు నడిచేలా చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎస్‌బీ సీఐ భాస్కర్, చంద్రశేఖర్, పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



- 'ఈ చిత్రంలో నిర్జీవంగా పడి ఉన్న వ్యక్తి రాజశేఖర్. చిత్తూరు పోలీసు విభాగంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)లో పనిచేసే వారు. పెళ్లి చూపులకు వెళ్లేందుకు సెలవు అడిగితే ఉన్నతాధికారులు నిరాకరించారు. సెలవు అడిగిన ప్రతిసారీ ఇతనికి నిరాశే ఎదురయ్యేది. దీంతో తీవ్ర ఒత్తిడికి గురై 2018 ఏప్రిల్ 20న చిత్తూరులోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తూ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.'

సెలవు కరువు

- పోలీసుశాఖలో కానరాని వారాంతపు సెలవు
- సెలవు అడిగితే..అధికారుల కన్నెర్ర
- ఖాకీలకు వీక్లీ ఆఫ్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవే
- మానసిక వేదనలో పోలీసులు

పోలీస్ ఉద్యోగం.. కత్తి మీద సాములాంటిది. విధి నిర్వహణలో పనిభారం.. కేసుల దర్యాప్తునకు ఉరుకులు, పరుగులు.. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, వేధింపులు.. రాజకీయ నేతల జోక్యం.. అనధికార బదిలీలు.. చార్జ్ మెమోలు.. వీటన్నింటికీ తోడు కుటుంబాలకు దూరం కావడంతో నాలుగో సింహం నలిగిపోతోంది. గతంలో ఉన్న వీక్ ఆఫ్ కరువు కావడంతో మానసిక వేదనకు గురవుతోంది. ఇటీవల జిల్లా పోలీసు శాఖలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శంగా నిలుస్తున్నాయి.



నలిగిపోతోంది.. నాలుగో సింహం

చిత్తూరు అర్బన్: పోలీస్.. అర్ధరాత్రి వేళ వీధుల్లో గస్తీ కాస్తూ ప్రజల మానప్రాణాలను కాపాడే రియల్ హీరో. రోడ్లపై దుమ్ము, ధూళిలో నిలబడి ట్రాఫిక్ నియంత్రణ చేసే ఓ సంఘ సేవకుడు. సమాజం కోసం తిండి తిప్పలు లేకుండా 24 గంటల్లో ఏ క్షణమైనా అధికారులు పిలిస్తే ఇట్టే వాలిపోయే ఓ సూపర్ మ్యాన్. చట్టం, న్యాయం, ధర్మానికి ప్రతిరూపాలైన మూడు సింహాల్లో.. కనిపించని నాలుగో సింహమే పోలీస్. అలాంటి నాలుగో సింహం పరిస్థితి ప్రస్తుతం బాలేదు. ఒత్తిళ్ల మధ్య నలిగిపోతోంది. కనీసం వారంలో ఒక్క రోజంటే ఒక్కరోజు.. సెలవు అడిగితే ఇచ్చే దిక్కులేదు.

నాటి చరిత్ర ఇదీ..

పోలీసులంటే క్రమశిక్షణకు మారుపేరు. స్టేషన్‌లో పనిచేసే పైఅధికారి ఏం చెబితే అది చేయాలి. నోరెత్తి ఎందుకు..? అని అడిగితే అంతే సంగతులు. ఇక నెలకు ఓ రోజు సెలవు కావాలని చిట్టీ రాసుకెళితే, అగ్గిమీద గుగ్గిలమై అధికారులు భగ్గుమనే వాళ్లు. అలాంటి పోలీసులశాఖలో గత వైఎస్సార్ సీపీ సర్కారు 'వీక్‌ఆఫ్' (వారాంతపు సెలవు) తీసుకొచ్చి, ఖాకీల పాలిట అండగా నిలిచింది. పోలీసుల సాధకబాధలను ఆలకించి తీసుకున్న వీక్ ఆఫ్ నిర్ణయం ఆ శాఖలో ఓ సరికొత్త సంచలనం నమోదు చేసింది. అసలు పోలీసులకూ ఓ కుటుంబం ఉందని, వారితో వారంలో ఒక్కరోజైనా గడపాలని వారాంతపు సెలవులను తీసుకొచ్చి సరికొత్త చరిత్ర సృష్టించింది. పని ఒత్తిడి కారణంగా ఏ ఒక్కరినీ బలి కోరకూడదని భావించి, ఎందరో పోలీసుల పని ఒత్తిడిని అర్థం చేసుకుని, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వీక్లీ–ఆఫ్ సంస్కరణ జిల్లాలోని కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి అధికారి వరకు ప్రతిఒక్క పోలీసు అధికారి ఉపయోగించుకున్నవారే.

ఆ చరిత్ర నేడు కనుమరుగు..

ప్రస్తుతం జిల్లా పోలీసుశాఖలో వీక్ ఆఫ్ పేరును ఖాకీలు దాదాపు మరిచిపోయారు. నిత్యం పనిలో ఒడిదుడుకులు, అధికారుల అరుపులు, క్షణం తీరిక లేని పరుగులతో సగటు పోలీసన్న బిజీ అయిపోయాడు. ఇలాంటి తరుణంలో కుటుంబంతో కలిసి వారంలో ఓ రోజు గడిపే పరిస్థితి కనుమరుగైంది. ఇటీవల జిల్లాలో జరిగిన పోలీసు సిబ్బంది బదిలీల్లో చిత్తూరు నుంచి రొంపిచెర్ల, సదుం, పుంగనూరు, సోమల లాంటి పోలీసుస్టేషన్లకు పదుల సంఖ్యలో సిబ్బంది బదిలీ అయ్యారు. భార్యా బిడ్డలు చిత్తూరులో.. కుటుంబ పెద్ద పుంగనూరు నియోజకవర్గంలో విధులు. వారంలో ఓ రోజు భార్య, బిడ్డల్ని చూద్దామని సెలవు అడిగితే, ఆ మాటను వినిపించుకునే నాథుడే లేరు.

సం'క్షామం'..

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ఏ లోటు రానివ్వకుండా చూసుకుంటామని, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పే ఉన్నతాధికారులు వీక్ ఆఫ్‌ను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఇక పోలీసులకు కష్టమొస్తే తామున్నామనే భరోసా ఇవ్వడానికి ఏర్పాటైన పోలీసు సంక్షేమ సంఘం జిల్లాలో ఉందో, లేదో కూడా తెలియని పరిస్థితి. వాళ్ల ఉనికిని కాపాడుకోవడం మాత్రమే యూనియన్ ఉందని తోటి సిబ్బంది బహిరంగంగానే దుమ్మెత్తిపోస్తున్నా.. నోరు మెదపని పరిస్థితి. ఏపక్షంగా జరిగిన బదిలీలను ఆపలేక, అడగలేకపోయిన యూనియన్ నాయకులు.. వారాంతపు సెలవు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడానికి కూడా వెనుకంజ వేయడం విమర్శలకు తావిస్తోంది.



జిల్లాలో పోలీసుశాఖ బలగం

హోదా	పోస్టు
ఎస్పీ:	1
ఏఎస్పీ:	1
డీఎస్పీలు:	6
సీఐలు:	30
ఎస్ఐలు:	41
ఏఎస్ఐలు:	103
హెడ్‌కానిస్టేబుళ్లు:	250
కానిస్టేబుళ్లు:	627
ఆర్మ్‌డు రిజర్వు:	360
మినిస్టీరియల్ స్టాఫ్:	35

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి పెద్దిరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే అవకాశాలుంటాయన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై వారం రోజుల పాటు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. అగ్నిప్రమాదాల నివారణకు ఏటా ప్రభుత్వం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం గుడిపాల మండలం పశుమంద గ్రామంలో ఉన్న కంపెనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక సేవలందిస్తూ మృతి చెందిన పలువురు సిబ్బందికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకర్, లీడింగ్ ఫైర్ మెన్‌లు శోభన్, ఏసుపాదం, సిబ్బంది కుశలన్, గిరిబాబు, రాజు, నవీన్, రాజేంద్ర పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



వెదురుకుప్పం: ఒరిగిన విద్యుత్ స్తంభం

వెదురుకుప్పం: చిత్తూరు జిల్లాలో పలు చోట్ల సోమవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. వెదురుకుప్పం మండలంలోని ఎగువ కనికాపురంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వృక్షాలు నేలకూలాయి. ఇళ్లపై పడడంతో పాక్షికంగా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కనికాపురం, ముతాలం గ్రామాల్లో అకాల వర్షంతో వరి పంట నేల కొరిగి నష్టాల పాలైనట్లు అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలులకు పంటలు ధ్వంసమయ్యాయి. మండలంలో కొన్ని గ్రామాల్లో వడగండ్ల వానకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

నేలరాలిన మామిడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు పంచాయతీల్లో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షం, ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. ఉరుములతో కూడిన వర్షం రావడంతో ఎండ తాపం నుంచి కొంత ఉపశమనం కలిగినా, కొన్ని చోట్ల మామిడి పంటకు నష్టం వాటిల్లింది.



వెదురుకుప్పం: కనికాపురంలో నేల కొరిగిన వృక్షం

నేలకొరిగిన వరి

తవణంపల్లె: మండలంలో ఆదివారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుగాలులకు వరి పంట నేలకొరిగింది. మండలంలో 475 ఎకరాల్లో వరి పంట వివిధ దశలో సాగులో ఉంది. ఈ దశలో అకాల వర్షంతో రైతులు నష్టపోతున్నారు. వర్షానికి, పెనుగాలులకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి



గంగవరం: పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని కీలపల్లి పంచాయతీ జేఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యం తన పొలంలోని చెట్ల కింద నాలుగు పాడి ఆవులు కట్టి ఉంచాడు. అయితే వర్షం కురుస్తున్న సమయంలో అక్కడ పిడుగు పడి రెండు పాడి ఆవులు ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. దాదాపు రూ. 2 లక్షలు విలువ చేసే పశువులు ప్రమాదంలో మరణించడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన చెందుతోంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరారు.

పార్టీ మారారంటూ తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

బంగారుపాళెం: 'వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భోజనానికి ఆహ్వానించారు. వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా ఆపార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కూర్మాయిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, గజేంద్రరెడ్డి, వాసుదేవరెడ్డి, మొగిలిరెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి జనసేన పార్టీలో చేరినట్లు సోషియల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసుకున్నారన్నారు. ఆదివారం ఓ కార్యక్రమం ఉందని, మీరు తప్పకుండా భోజనానికి రావాలని వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలను ఆహ్వానించారన్నారు. దీంతో వారు వెళ్లగానే బలవంతంగా వారి మెడలో కండువాలు వేసి ఫొటోలు తీసి, జనసేన పార్టీలో చేరినట్లుగా తప్పుడు ప్రచారం చేసుకోవడం సమంజసం కాదన్నారు. ఇలాంటి రాజకీయాలను జనసేన నాయకులు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, కూర్మాయిపల్లె సర్పంచ్ హేమలత, బాబురెడ్డి, పాలాక్షిరెడ్డి, థామస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,100 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,791 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కాను కల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

22 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు వర్సిటీ అధికారులు కళాశాలలకు పరీక్షల షెడ్యూల్ పంపించారు. విద్యార్థులకు ఈ నెల 19 నుంచి హాల్ టికెట్లు అందజేయనున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు
- రాజ్యాంగ నిర్మాతను యువత ఆదర్శంగా తీసుకోవాలి



చౌడేపల్లె: నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చౌడేపల్లె: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నేటితరం యువత కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులరించారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదు వులు చదివి భారత రాజ్యాంగకర్తగా నిలిచా రన్నారు. ఆయన పేదల అభ్యున్నతికి కృషి చే సిన మహనీయులన్నారు. ఆదర్శంగా తీసు కోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, ఎంపీపీ రామమూర్తి, ఎంపీటీసీ సభ్యులు శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, ఎంపీడీఓ లీలామాధవి, సూపరింటెండెంట్ షబ్బీర్ అహమ్మద్, ఈఓపీఆర్డీ కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

పుత్తూరు: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం కావాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాల్సిందేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు ఆర్కే రోజా స్పష్టం చేశారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పుత్తూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మా ట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అంబేడ్కర్ స్ఫూర్తితో పరిపాలన సాగించారన్నారు. నేటి కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు దళితులను ఎక్కడికక్కడ అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు లక్ష్మణమూర్తి, బాలసుబ్రమణ్యం, ప్రతాప్, సుబ్రమణ్యం, శివ, వేలాయుధం, రాంబత్తయ్య, గంగాధరం, రామ్మూర్తి, మస్తాన్, ఉదయ్, బాబు, ప్రభు, బొజ్జయ్య, పార్టీ నాయకులు మాహీన్, ఏకాంబరం, అన్నాలోకనాథం, భాస్కర్ యాదవ్, చిరంజీవియాదవ్, మురళీయాదవ్, భాస్కర్‌యాదవ్, ప్రసాద్, గోపి, మునిరత్నం, చిన్నా, మురళీరెడ్డి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది అంబేడ్కర్ రాజ్యాంగం

చిత్తూరు కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ రాజ్యాంగం మేరకు పాలన సాగించారని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రాన్ని మరో బీహార్‌గా మార్చారని విమర్శించారు. సమాజంలో అందరూ సమానంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావించారని మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి తెలిపారు. జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రజనీకాంత్, పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్, కార్పొరేటర్ లక్ష్మణ స్వామి, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రూరల్ పార్టీ మండల అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, నాయకులు జ్ఞానజగదీష్, సూర్యప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, అంజలిరెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, ఆను, మధుసూదన్‌రాయల్, రాజేంద్ర, త్యాగ, రాబర్ట్, స్టాండ్లీ, ప్రసాద్, గిరిధర్‌రెడ్డి, ప్రేమ్, అల్తాఫ్, చాన్‌బాషా, నారాయణ, సాల్మన్, ఇరువారం ప్రేమ్, ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినవ అంబేడ్కర్ వైఎస్ జగన్

శ్రీరంగరాజపురం: అంబేడ్కర్ ఆశయ సాధనకు కట్టుబడి పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ అభినవ అంబేడ్కర్‌గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శ్రీరంగరాజపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలు, బాలికలు, దళితులకు రక్షణ కరువైందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. విజయవాడలో దాదాపు 20 ఎకరాల్లో రూ.400 కోట్ల వ్యయంతో 250 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెడితే, జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఆ మహనీయుడి విగ్రహంపై దాడులు చేసిన పట్టించుకోలేదన్నారు.







శ్రీరంగరాజపురం: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పుత్తూరు: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, చిత్తూరు కార్పొరేషన్: నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో సినీ రచయిత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారిని సోమవారం తెలుగు సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు దగ్గరుండి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో పండితుల ఆశీర్వచనాలు పలికి, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



లైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు, పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యే లు గురుజాల జగన్ మోహన్‌నాయుడు, మురళీమోహన్, నాని పరిశీలించారు. వారు సోమవారం రైల్వేస్టేషన్‌కు వచ్చి మీడియాతో మాట్లాడారు. తిరుపతి–కాట్పాడి డబ్లింగ్‌లైన్ ఏర్పాటుతో పలు రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అమృత్ భారత్ కింద చిత్తూరు రైల్వే స్టేషన్‌లో చేపట్టిన పనులు సగం కూడా పూర్తికాకపోవడంతో కాంట్రాక్టరుపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ అముద, చుడా చైర్మన్ హేమలత, రాజన్, స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, ఆర్‌పీఎఫ్ సీఐ కుమార్, జీఆర్‌పీ ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం.. కేసు నమోదు

చిత్తూరు అర్బన్: ఉద్యోగం పేరిట నగదు మోసం చేసిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. చిత్తూరులోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన పురుషోత్తం అనే వ్యక్తి ఉద్యోగం పేరిట మోసపోయాడు. ఐటీ ఉద్యోగం ఇప్పిస్తామని బెంగళూరుకు చెందిన నాగర్జున అనే వ్యక్తి రూ.16.50 లక్షలు తీసుకున్నాడు. తీరా మోసం అని తెలిసి పురుషోత్తం చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నాగర్జునపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేటకు వెళ్లొద్దు

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిసేధించారని, వేటకు ఎవరూ వెళ్లొద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యశాఖ నిషేధ ఆజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీ ఎంఆర్‌ఎఫ్ 1994 సెక్షన్(4)ను అనుసరించి శిక్షార్హులు అవుతారని, అలాగే వారి బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనం చేసుకుంటామన్నారు.

అంబేడ్కర్ అంటే చిన్నచూపెందుకు?

- జిల్లాస్థాయి కార్యక్రమానికి హాజరుకాని ప్రజా ప్రతినిధులు
- దళితులు ప్రశ్నిస్తారనే గైర్హాజరయ్యారేమో?
- తూతూమంత్రంగా అధికారిక అంబేడ్కర్ జయంతి
- విమర్శలు గుప్పిస్తున్న దళితులు, సంఘ నాయకులు



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో కనిపించని కూటమి ఎమ్మెల్యేలు

చిత్తూరు కలెక్టరేట్ : ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన అంబేడ్కర్ జయంతి అధికారిక వేడుకలకు కూటమి ప్రజాప్రతినిధులు దూరమయ్యారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో సోమవారం నిర్వహించిన అధికారిక కార్యక్రమానికి కూటమి



వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ విద్యాధరి, సంఘ నాయకులు

ఎంపీ, ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరవుతారని ఎదురు చూసిన దళితులు, దళిత సంఘ నాయకులకు నిరాశే మిగిలింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు కూటమి ప్రజాప్రతినిధులిచ్చే గౌరవం ఇదేనా? అంటూ దళితులు, దళిత సంఘ నాయకులు పెదవి విరిచారు. గత ఐదేళ్లపాటు అంబేడ్కర్ జయంతి అధికారిక కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి సర్కారు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకలను తూతూమంత్రంగా నిర్వహించింది. దీనిపై పలువురు పెదవి విరుస్తున్నారు.

దళితులు ప్రశ్నిస్తారనే గైర్హాజరయ్యారా?

కూటమి అధికారంలోకి వచ్చిన గత పది నెలలుగా దళితుల అభ్యున్నతికి చేసిందేమీ లేదు. దళితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో దళితులు అందజేసిన వినతులు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. జిల్లాలోని అన్ని దళితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించని పరిస్థితి. గత ఐదేళ్ల పాటు దళితులకు అందిన సంక్షేమ పథకాలు, కూటమి పాలనలో వారి దరిచేరని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరైతే ఎక్కడ ప్రశ్నిస్తారేమోనని కూటమి ప్రజాప్రనిధులు గైర్హాజరై, ఉంటారని దళితులు, ఆ సంఘ నాయకులు గుసగుసలాడారు. అంబేడ్కర్ అంటే కూటమి ప్రజాప్రతినిధులకు చిన్నచూపెందుకని? దళిత సంఘ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

విద్యతోనే గౌరవం సాధ్యం

విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. దళితులు ఆర్థికంగా అభ్యున్నతి చెందాలన్నారు. సమాజంలో గౌరవం సంపాదించాలంటే విద్య ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాభ్యాసానికి అన్ని సౌకర్యాలున్నాయన్నారు. డ్వాక్రా సంఘాల్లో మహిళలు రుణాలు తీసుకుని చిన్నచిన్న వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి సాధించి, సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. ప్రతి ఇంట్లో ఒక వ్యాపార, పారిశ్రామికవేత్త ఉండేలా ఎదగాలన్నారు. ఈ వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖాధికారి చిన్నయ్య, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు గోవిందన్, రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్‌బాబు, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, ధనశేఖర్, శంకర్, రవి, దేవరాజులు, మునస్వామి, డేవిడ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చిద్విలాసం

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో కనువిందు చేశారు. సోమవారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మ నక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందనాలంకరణ, పుష్పాలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా దేవస్థాన ప్రధానార్చకులు సీ తారామయ్యస్వామి, రాజ్యలక్ష్మి వ్యవహరించారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా ఉమాపతి

వరదయ్యపాళెం: సమాచార హక్కుచట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యవేడు మండలం, మాదనపాళెం గ్రామానికి చెందిన సూరతిని ఉమాపతి నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ నుంచి ఉత్తర్వులందజేసినట్లు ఆయన వివరించారు. ఉమాపతి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆ చట్టం విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

సీతారాముల కల్యాణ వైభోగమే!



కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వీధంతా పందిరి.. మదినిండా భక్తి...జనకరాజ పుత్రిక జానకీదేవికి దశరథ సుతుడు శ్రీరామచంద్రుడి కల్యాణం సోమ వారం కనులపండువగా సాగింది. చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. ఉదయం అష్టోత్తర శతకలశ, మహా తిరుమంజనంను నిర్వహించారు. అభిషేక పూజలతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ప్రత్యేక కల్యాణ వేదికను తీర్చిదిద్దారు. ఉభయదారులు సీతారాముల కల్యాణ వైభోగానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తర్వాత సీతారాముల వారిని అందంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చా రు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణఘట్టం ప్రారంభించారు. సుముహుర్తాన మాంగల్య ధారణ గావించారు. మహా మంగళ హారతితో కల్యాణమహోత్సవాన్ని ముగించారు. రెండు గంటలకు పాటు సాగిన ఉత్సవంలో భక్తులు రామనామస్మరణ చేస్తూ తన్మయత్వం పొందారు. రాత్రి పుష్పపల్లకి సేవలో స్వామి వారు విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.



హాజరైన భక్తులు

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారి మార్గంలో దిగువచావలి ఫ్లైఓవర్‌పై శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం లోడ్తుతో వెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, అధికారుల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం మార్గమధ్యంలో దిగువచావలి గ్రామం ఫ్లై ఓవర్‌పై టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే బియ్యం వ్యాపారులు వాహనంలోని 20 టన్నుల బియ్యాన్ని గ్రామంలోని రహస్య ప్రదేశానికి తరలించారు. స్థానికుల సమాచారంలో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగరాజు రేషన్ బియ్యాన్ని



రేషన్ బియ్యం తరలిస్తూ బోల్తా పడిన వాహనం

స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డీటీ గోపీనాథ రెడ్డి, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి సమాచారం అందించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వీఆర్వోలు రమేష్, వంశి నాయుడుపేట గోదాముకు తరలించి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వక్ఫ్‌బోర్డు చట్టం రద్దు చేయండి

- ముస్లింల నిరసన



రోడ్డుపై బైటాయించి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనారిటీ నాయకులు

తిరుపతి మంగళం : దేశంలో ముస్లిం, మైనారిటీలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇందులో భాగంగానే వక్ఫ్‌బోర్డు చట్టం తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరీ, మహ్మద్‌కాసీమ్‌బాషా, షేక్ ఇమ్రాన్ బాషా ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే రద్దు చేయాలంటూ తిరుపతి మహతి ఆడిటోరియం వద్ద ఉన్న పెద్ద మసీదు వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనారిటీ నగర అధ్యక్షులు మహ్మద్ కాసీమ్‌బాషా(చోటాబాయ్) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున వక్ఫ్‌బోర్డు చట్టానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టినట్టు తెలిపారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది ముస్లింల భూములను కొట్టేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలతో వక్ఫ్‌బోరు చట్టం ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు టీడీపీ జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ముస్లింలకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. నిత్యం ముస్లింల సంక్షేమాన్ని ఆకాంక్షించే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్‌బోర్డ్ బిల్లును వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు ఖాదర్ బాషా, గఫూర్, కజీర్, ఇస్మాయిల్, ముజాబింద్, జారీద్, మొదిసీన్, చాన్‌బాషా, అన్వర్, హాజీ షేక్ ఫరీతాప్, షేక్ సలీమ్, ఎస్‌కె.కలీమ్, ఎస్. అమీర్‌బాషా పాల్గొన్నారు.

సముద్రంలోకి 440 తాబేళ్ల పిల్లలు

వాకాడు: మండలంలోని నవాబుపేట సముద్ర తీరంలో సోమవారం ఫారెస్టు అధికారుల సమక్షంలో పిల్లలు ఉత్పత్తి చేసే ఆలీవ్‌రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. ఈ ఏడాది మూడో దఫా నవాబుపేట వద్ద ఉన్న తాబేళపిల్లల సంరక్షణా కేంద్రం(హేచరీ)లో దాదాపు 475 గుడ్లను సేకరించి పొదిగించారు. అందులో 440 పిల్లలు ఆరోగ్యంగా బయటకు రావడంతో వాటిని సముద్రంలో విడిచి పెట్టారు. తాబేళ్లను చంపినా, వేటాడినా చట్టరీత్యా నేరమని ఫారెస్టు అధికారులు తెలిపారు.

ఘనంగా తమిళ ఉగాది

- మహిషాసురమర్దినికి పాలాభిషేకం

నగరి: పట్టణంలో సోమవారం తమిళ ఉగాది పండును ఘనంగా జరుపుకున్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు మద్దూరు గ్రామంలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో తమిళ ఉగాదిని పురస్కరించుకుని నిర్వహించిన 25వ సంవత్సర పాలాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. అమ్మవారికి 1008 కలశాలతో నిర్వహించే పాలాభిషేకం మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. పాల కలశాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆలయ అధికారులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. పూజల అనంతరం



అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి

భక్తులకు ఆలయం వద్ద ఆమె భారీగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీడీ భాస్కర్, కౌన్సిలర్ బీడీ జ్యోతి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, నాయకులు మురుగ, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



1008 పాల కలశాల ఊరేగింపు

గోమాతల మృతిపై పవన్ స్పందించాలి



మాట్లాడుతున్న విజయానందరెడ్డి

- నిజాలు మాట్లాడితే ఆరోపణలు అంటారా..?
- విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: సనాతన హిందూ ధర్మ పరిరక్షకుడని చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గోమాతల మృతిపై స్పందించాలని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం చిత్తూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బీఆర్ నాయుడు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీటీడీ అప్రతిష్టపాలవుతోందని, పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు మృతి బాధాకరమన్నారు. ఘాట్ రోడ్డులో ప్రమాదాలు పెరుగుతున్నాయని విమర్శించారు. టీటీడీ గోశాలలో 100 గోవులు చనిపోయాయని, దీనిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నిజాలు మాట్లాడితే ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజాలను కప్పిపుచ్చాలనుకుంటే దాగవన్నారు. మొదట బీఆర్ నాయుడు పొరబాటు జరిగిందని, తర్వాత అటువంటిది లేదని రెండు నాలుకల ధోరణిలో మాట్లాడడం తగదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు అధికార పార్టీ మద్దతు పలికిందని, రాబోయే రోజుల్లో చర్చిలను కూడా కైవసం చేసుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, నాయకులు రజనీకాంత్, కృష్ణమూర్తి, జయపాల్, కృష్ణరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనాన్ని ఇప్పటికైనా నిర్మించరూ!

- జేసీకి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

పలమనేరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళుర్పించడం కాదు..ఆయన పేరిట పలమనేరులో భవన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలని పలమనేరు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నేతలు సోమవారం జిల్లా కేంద్రంలోని జేసీ విద్యాధరిని కలిసి కోరారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం కోసం రెండు దశాబ్దాలపాటు పోరాటం చేస్తే గతంలో దండుమిట్ట వద్ద 46 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. అప్పట్లో నిధులు మంజూరైనా పనులు మొదలుకాక ఇప్పటికీ ఆ స్థలం ఖాళీగానే ఉందని ఆమె దృష్టికి నివేదించారు. అక్కడ భవనం నిర్మిస్తే నియోజవర్గంలోని 37వేల మంది ఎస్సీ, ఎస్టీల శుభకార్యాలు, వివాహాలు, సమావేశాలకు అనువుగా ఉంటుందని తెలియజేశారు. జేసీని కలిసిన వారిలో పుష్పరాజ్, జయరామ్ తదితరులున్నారు.

ఒంటరి ఏనుగు వీరంగం

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో నెల రోజులుగా రైతన్నలకు కంటికి కునుకు లేకుండా చేస్తున్న ఒంటరి ఏనుగు సోమవారం తెల్లవారుజామున సైతం వీరంగం సృష్టించింది. కమ్మపల్లె పంచాయతీ దిన్నెపాటిలో పంటలకు నష్టం కలిగించింది. మామిడి చెట్లను విరిచేయడంతోపాటు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసింది. అటవీ శాఖ అధికారులు కూడా దీనిని కట్టడి చేయడంలో చేతులెత్తేసున్నారని రైతులు లబోదిబోమంటున్నారు.



ఏనుగు ధ్వంసం చేసిన డ్రిప్ పరికరాలు

నవవధువు అనుమానాస్పద మృతి

- భార్య కుటుంబ సభ్యులపై భర్త అనుమానం
- కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నాలుగేళ్ల ప్రేమ. వివాహానికి పెద్దల నిరాకరణ. కులమతాలు వేరుకావడమే ప్రధాన సమస్య. పెద్దల్ని ఎదిరించి పెళ్లిచేసుకున్నారు. ఇప్పుడే రెండు నెలైంది. నాన్న దిగులుగా ఉన్నాడు.. వచ్చి చూసి వెళ్లమని బతిమిలాడితే పుట్టింటికి వెళ్లింది. గంటలోపే శవమైంది. చిత్తూరు నగరంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై వాస్తవాలేమిటీ ఎవరికీ తెలియడంలేదు. ఈ ఘటనపై పోలీసులు అనుమానానస్పద మృతి కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. టూటౌన్ పోలీసులు, మృతురాలి భర్త కథనం మేరకు..

చిత్తూరు నగరంలోని బాలాజీ కాలనీకి చెందిన షౌకత్‌అలీ మూడో కుమార్తె యాస్మిన్ (26) నగరంలోని ఓ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసింది. బీటెక్ చదువుతుండగానే పూతలపట్టు మండలం పోటుకనుమ దళితవాడకు చెందిన సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు నాలుగేళ్ల పాటు వీళ్ల ప్రేమ ప్రయాణం కొనసాగింది. అయితే యాస్మిన్‌కు చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం చేయడానికి ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న పెళ్లి జరగాల్సి



సాయితేజ, యాసిన్ పెళ్లినాటి ఫొటో

ఉండగా, 6వ తేదీన ఆమె సాయితేజతో వెళ్లిపోయి, అతడ్ని వివాహం చేసుకుంది. పెద్దల నుంచి ప్రాణహాని ఉందొచ్చని తిరుపతి పోలీసులను ఆశ్రయిస్తే, ఇరుపక్షాల కుటుంబ సభ్యుల్ని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పూతలపట్టులోనే సాయితేజ, యాసిన్ కాపురం పెట్టారు. ఇటీవల యాసిన్ తన అక్కలు, అమ్మతో తరచూ ఫోన్‌లో బాగానే మాట్లాడేది. యాసిన్ వెళ్లిపోయినప్పటి నుంచి తండ్రి దిగులుగా ఉన్నాయని, ఓ సారి వచ్చి చూసి వెళ్లాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆదివారం సాయితేజ, యాసిన్ ఇద్దరూ కారులో చిత్తూరుకు వచ్చారు. యాసిన్ ఇంటి వద్దకు వెళ్లడానికి సాయితేజ భయపడి, పీసీఆర్ కూడలిలో యాసిన్‌ను దిగబెట్టి.. వాళ్ల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. ఓ కారులో వచ్చిన యాసిన్ కుటుంబ సభ్యులు, ఆమెను బాలాజీ కాలనీలోని ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికి రాగానే యాసిన్ తండ్రి షౌకత్ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ' మా పరువు మొత్తం తీశావు, ఇప్పుడెందుకు వచ్చావు..? వెళ్లిపో ఇక్కడి నుంచి..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనే బయటకు వెళ్లిపోయాడు. కొద్దిసేపు తరువాత తలుపుతెరచి చూస్తే, యాసిన్ చున్నితో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా యాసిన్ మృతికి ఆమె కుటుంబ సభ్యులే కారణమంటూ సాయితేజ ఆరోపిస్తున్నాడు. దీనిపై టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా యాసిన్ బలవన్మరణానికి పాల్పడిందా..? కుటుంబ సభ్యులు ఏమైనా చేశారా..? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు యాసిన్‌ను పీసీఆర్ కూడలి నుంచి ఇంటికి కారులో తీసుకెళ్లిన యువకులను సైతం పోలీసులు విచారిస్తున్నారు. కాగా ఇంటి నుంచి వెళ్లిన యాస్మిన్ తండ్రి షౌకత్ అలీ ఆచూకీ తెలియ రాలేదు. దీంతో యాస్మిన్ది హత్య..? ఆత్మహత్య..? అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మృతురాలి మెడ వెనుక ఉన్న ఎముకను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. యువతి తనకు తానుగా ఆత్మహత్య చేసుకుందా? ఎవరైనా గొంతుకు చున్ని బిగించి చంపేశారా? అనే అంశంపై పోలీసులు కూడా ఎటు తేల్చుకోలేక పోతున్నారు.